క్లుప్తంగా

తెలుగుపై పట్టు సాధించాలి

కురుపాం: తెలుగుపై ప్రతి విద్యార్థి పట్టు సాధించేలా ఉపాధ్యాయులు బోధించేందుకు ప్రయత్నించాలని రిసోర్సుపర్సన్ టి.చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం జి.రామగోవిందరావు ఆధ్వర్యంలో తెలుగు సబ్జెక్ట్‌పై స్కూల్ కాంప్లెక్స్‌ను గురువారం నిర్వహించారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న డివిజన్ పంచాయతీ అధికారి రాంప్రసాద్

కురుపాం: మండలంలోని అన్ని పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని పాలకొండ డివిజనల్ పంచాయతీ అధికారి జె.రాంప్రసాద్ సూచించారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శులతో గురువారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నులు వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టడమే కాకుండా వేసవి దృష్ట్యా ఎటువంటి తాగునీటి ఎద్దడి లేకుండా, పారిశుద్ధ్యం తదితర వాటిపై దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పనులను పర్యవేక్షించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ సత్యనారాయణ

కురుపాం: సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు మండలంలో జరుగుతున్న నాడు – నేడు పనులను వారం వారం పరిశీలించి వాటి పురోగతిపై యాప్‌లో అప్‌లోడ్ చేస్తుండాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ, మండల ఇంజినీరింగ్ అధికారి నాగేశ్వరరావు, ఎంఈఓ సత్యనారాయణ అన్నారు. వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మండల సచివాలయ సిబ్బందితో గురువారం వారు సమావేశమయ్యారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న భోజన పథకం నాణ్యత, మెనూ పరిశీలించాలన్నారు. సమావేశంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపులతో వర్షం



గుమ్మలక్ష్మీపురంలో కురుస్తున్న వర్షం

గుమ్మలక్ష్మీపురం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం ఆకా శంలో మబ్బులు కమ్ముకోవటంతో వాతావరణం 4 గంటల సమయానికే కాస్త చీకటి మయం అయింది. ఈ సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది.

ఏరియా ఆస్పత్రికి జనరల్ సర్జన్ నియామకం

సీతంపేట: సీతంపేట ఏరియా ఆస్పత్రికి జనరల్ సర్జన్‌గా కె.సీతారామయ్య నియమితులయ్యారు. ఈ మేరకు బాధ్యతలు చేపట్టారు. ఈయన జంగారెడ్డిగూడెం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటికే ఈ ఆస్పత్రిలో ఈఎన్‌టీ, ఆర్థో వంటి సర్జరీలకు స్పెషలిస్టులు ఉన్నారు. దీంతో ఆరోగ్యశ్రీ ఆపరేషన్‌లు ఇక్కడే అవుతున్నాయని సూపరెంటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు.

బోర్లకు మరమ్మతులు



కందివలస మండల పరిషత్ స్కూల్ వద్ద బోరుకు మరమ్మతులు

కొమరాడ: మండలంలోని 526 చేతిపంపులకుగాను వేసవి కాలంలో తాగునీరు ఎద్దడి లేకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో క్రాష్ ప్రోగ్రాంలో భాగంగా మరమ్మతులకు గురైన బోర్లను బాగు చేస్తున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే గ్రామల్లో మరమ్మతులకు గురైన సుమారు 35 బోర్లు రిపేర్ చేశామని మెకానిక్ తిరుపతి చెప్పారు. ఏప్రిల్ 10 వరకు క్రాష్ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములు



సీతంపేట: గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో అమరజీవి చిత్రపటం వద్ద నివాళులు

అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని పలువురు వక్తలు పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా పలు చోట్ల ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి గురువారం ఘన నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ అవతరణకు ప్రాణత్యాగం చేసిన గొప్ప వ్యక్తి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు నేటి యువత పాటు పడాలని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు అధికారులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



పాలకొండ: శాఖా గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీజీఈఓ నాయకులు



గరుగుబిల్లి: పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్ అజురఫీజాన్ తదితరులు



పాలకొండ రూరల్: తంపటాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



భామిని: పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్ అప్పారావు, సిబ్బంది

నాడు – నేడు పనులను పర్యవేక్షించాలి

భామిని: నాడు – నేడు పనులను పర్యవేక్షించాలని ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు, ఎంఈఓ శ్రీనివాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో వారు గురువారం సమావేశం నిర్వహించారు. మనబడి నాడు – నేడు నిధులతో రెండో విడత పనులు జరుగుతున్న పాఠశాలలపై సమీక్షించారు. పనులను విధిగా పర్యవేక్షించాలన్నారు. సంబంధిత నిర్మాణాలపై నివేదికలు ఇవ్వాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని కూడా పరిశీలించాలని అన్నారు. వారానికి మూడు పాఠశాలలను విధిగా తనిఖీలు చేయాలన్నారు. ఎంఆర్‌సీ సీఏ రామకృష్ణ, సీఆర్‌పీలు టి.ప్రసాద్, చిన్నబాబు, సంజీవ్, కిశోర్‌కుమార్, ఐఈఆర్‌టీలు సురేష్‌నాయుడు, వెంకటరావు సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణారావు, ఎంఈఓ శ్రీనివాస్

అంగన్‌వాడీ కేంద్రం సందర్శన

భామిని: మండలంలోని సతివాడ అంగన్‌వాడీ కేంద్రాన్ని కొత్తూరు ఐసీడీఎస్ సీడీపీఓ తులాల విమలారాణి గురువారం సందర్శించి మంజూరైన నిధుల వినియోగంపై వాకబు చేశారు. అంగన్‌వాడీ కేంద్రానికి నాడు – నేడు అప్‌గ్రేడేషన్ కింద మంజూరైన రూ.5లక్షల నిధులతో చేపట్టిన పనులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం ముద్దాడ పవిత్ర, సర్పంచ్ పాశర్ల రామారావుతో చర్చించి చేపట్టాల్సిన నిర్మాణ పనులపై సూచనలు చేశారు. పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. తక్షణమే నిర్మాణ పనులు చేయించాలన్నారు. అనంతరం కీసర, కోసలి, భామిని కేంద్రాలను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. పౌష్టికాహారం వినియోగం, పిల్లల బరువుల నమోదుపై సూచనలు చేశారు.



సతివాడలో పనుల రికార్డులు తనిఖీ చేస్తున్న సీడీపీఓ

పరీక్ష కేంద్రాల తనిఖీ



బాలుర పరీక్ష కేంద్రం తనిఖీ చేస్తున్న ఐటీడీఏ పీఓ నవ్య

సీతంపేట: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న కేంద్రాలను అధికారులు తనిఖీలు చేశారు. స్థానిక గిరిజన బాలుర జూనియర్ కళాశాలలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.నవ్య సందర్శించారు. స్థానిక బాలికల గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ తనిఖీ చేశారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఎడ్యుకేషన్ ఓఎస్‌డీ యుగంధర్ కూడా సందర్శించారు.



బాలికల కళాశాలలో పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం

పాలకొండ: యాదవ సామాజిక వర్గానికి గుర్తింపు కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డికి రుణపడి ఉంటామని నగర పంచాయతీ వైస్ చైర్మన్, యాదవ సామాజిక వర్గ నాయకులు పల్లా ప్రతాప్ పేర్కొన్నారు. స్థానిక సంస్థల కోటాలో యాదవ సామాజిక వర్గానికి చెందిన నర్సు రామారావుకు అవకాశం కల్పించడం ద్వారా తమ సామాజిక వర్గానికి తగిన గుర్తింపు కల్పించారని ఒక ప్రకటనలో తెలిపారు. యాదవులను బీసీ – బీలో చేర్పించేందుకు సీఎంకు వినతిపత్రం అందిస్తామని పేర్కొన్నారు.

రహదారి మధ్యలో కూలిన వృక్షం

- బైక్‌పై వెళ్తున్న ఇరువురికి గాయాలు

గుమ్మలక్ష్మీపురం: ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా చెట్టు కూలి పడటంతో జియ్యమ్మవలస మండలం కన్నపుదొరవలస గ్రామానికి చెందిన ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. గుమ్మలక్ష్మీపురం మండలంలోని పి.ఆమిటి జంక్షన్‌లో రోడ్డు పక్కనే ఉన్న నల్లతుమ్మ చెట్టు గురువారం ఉదయం ప్రధాన రహదారి (గుమ్మలక్ష్మీపురం నుంచి పార్వతీపురం వెళ్లే మార్గం) మధ్యలో కూలిపోయింది. ఈ ఘటనలో కన్నపుదొరవలస గ్రామం నుంచి గుమ్మలక్ష్మీపురం వైపు ద్విచక్ర వాహనంతో వస్తున్న కార్తీక్, యుగంధర్‌పై చెట్టు పడటంతో కొమ్మలు బలంగా తగిలాయి. వాహనం నడుపుతున్న కార్తీక్‌కు కొద్దిపాటి గాయాలైనప్పటికీ, వెనుక కూర్చొన్న యుగంధర్‌కు మాత్రం తల, వీపు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వటంతో అక్కడికి చేరుకుని యుగంధర్‌కు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం నిమిత్తం పార్వతీపురంలోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. చెట్టు రహదారికి అడ్డుగా పడటంతో రెండు వైపుల నుంచి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం తెలుసుకున్న ఎల్విన్‌పేట ఎస్‌ఐ షన్ముఖరావు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని, గుమ్మలక్ష్మీపురంలో సెకెండ్ ఇంటర్ పరీక్ష రాసేందుకు వచ్చిన పలువురు విద్యార్థులకు వాహనాలు సమకూర్చి పరీక్ష కేంద్రాలకు చేరవేశారు. స్థానికుల సాయంతో చెట్టు కొమ్మలను తొలగించి వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు. రోడ్డు పక్కన ఉన్న ఈ చెట్టు మొదలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించటంతో ఈ ప్రమాదం జరిగిందని గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పి.ఆమిటి జంక్షన్‌లో రహదారి మధ్యలో కూలిన చెట్టు

అప్రమత్తత అవసరం

పాలకొండ రూరల్: కంటికి సంబంధించిన సమస్యలపై అవగాహన పెంచుకోవాలని, అప్రమత్తంగా వ్యవహరించాలని నేత్రవైద్య నిపుణులు సీహెచ్ రామకృష్ణారావు అన్నారు. పాలకొండ ఏరియా ఆస్పత్రిలో గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా ఈ తరహా సమస్యలతో ఇబ్బందులు పడుతున్న రోగులకు అవసరమైన పరీక్షలు గురువారం నిర్వహించారు. ఈ క్రమంలో గ్లకోమా సమస్య లక్షణాలు, వాటి నివారణకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, శస్త్రచికిత్సలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ జి.నాగభూషణరావు, ఆర్‌ఎంఓ జె.రవీంద్ర కుమార్, డాక్టర్ కె.త్రినాధరావు పాల్గొన్నారు.

మురిసిన భారత్



ఆస్కార్‌తో మురిసిన భారత్ వర్ణచిత్రం

గరుగుబిల్లి: ఆర్‌ఆర్‌ఆర్ సినిమాకు ఆస్కార్ అవార్డు రావడంతో భారతావని మురిసిపోయింది. ఈ నేపథ్యంలో మండలంలోని నాగూరుకు చెందిన ప్రముఖ నఖ చిత్రకారుడు పల్ల పరిశినాయుడు ఆర్‌ఆర్‌ఆర్ సినిమాకు ఆస్కార్ రావడంతో మురిసిన భారత్ అంటూ గురువారం వేసిన వర్ణ చిత్రం పలువురిని ఆకట్టుకొంది.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



కొమరాడ: పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న ఇంటర్ విద్యార్థులు

కొమరాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. 289 మంది విద్యార్థులకుగాను ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కురుపాం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు తెలుగు, హిందీ పరీక్షలు జరిగాయని ప్రిన్సిపాల్ హరికృష్ణ తెలిపారు. తొలి రోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.

కనుల పండువగా కోటదుర్గ ఆలయ పునఃప్రతిష్ఠ

- వీరఘట్టంలో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

వీరఘట్టం: మండల కేంద్రంలో ప్రముఖ యజ్ఞకర్త ఎస్.వి.ఎల్.ఎన్.శర్మయాజీ దాతల సహాయంతో నూతనంగా నిర్మించిన శ్రీకోటదుర్గ తల్లి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాన్ని కనుల పండువగా గురువారం నిర్వహించారు. దీంతో వీరఘట్టం పట్టణంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ ప్రతిష్ఠ మహోత్సవంలో తొలి రోజు దేవతా విగ్రహాల గ్రామ ప్రదక్షిణ, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పరిషత్ కృచ్ఛ్రత్రయం, పంచగవ్య ఆరాధన, అఖండ దీపారాధన, ఋత్విక్ వరుణ ప్రధానం,యాగశాల ప్రవేశ ద్వార పూజ, ధ్వజ పతాకావిష్కరణ, మండల మండపారాధనలు, జలాధివాసం, అగ్ని ప్రతిష్ఠ తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అంతకు ముందు ఆలయ నిర్మాణానికి విరాళాలు ఇచ్చిన సుమారు 250 మంది దాతలు సతీసమేతంగా పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. దీక్షా వస్త్రాలు ధరించి వచ్చిన దంపతులకు వేద పండితులు దీక్షా కంకణాలు కట్టారు. మూడు రోజుల పాటు జరగనున్న ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో దంపతులు పాల్గొనాలని వేదపండితులు సూచించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించిన రాజమండ్రికి చెందిన శిల్పి తమ్మినేని అశోక్, పార్వతీపురానికి చెందిన వెల్డర్ యాండ్రాపు హరిలను శర్మయాజీ, ఉత్సవ కమిటీ సభ్యులు బంగారు కంఠాభరణాలతో సత్కరించారు. అనంతరం పంచలోహాలతో తయారు చేసిన 108 కిలోల కోటదుర్గ తల్లి ఉత్సవ విగ్రహాన్ని సాయంత్రం ఊరంతా ఊరేగించారు. దీంతో దుర్గాదేవి నామస్మరణతో వీరఘట్టం పట్టణం మారుమోగింది.



పూజలందుకుంటున్న కోటదుర్గ తల్లి 108 కిలోల పంచలోహ విగ్రహం



కోటదుర్గ తల్లి ఉత్సవ విగ్రహంతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు



కోటదుర్గ తల్లి ఆలయ ప్రతిష్ఠ పూజా కార్యక్రమంలో పూజలు చేస్తున్న దాతలు

ముగిసిన డోలోత్సవాలు

భామిని: మండలంలోని లివిరిలో వెలిసిన శ్రీగోపినాథ రాధాకృష్ణుల డోలోత్సవాలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా రాధాకృష్ణుల మూలవిరాట్‌లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆంధ్రా – ఒడిశాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చి ప్రత్యేక దర్శనాలు చేసుకున్నారు.

ప్రత్యేకంగా అలంకరించిన మూలవిరాట్‌లు →



'ఆసరా'తో ఆర్థికాభివృద్ధి

కురుపాం: వైఎస్సార్ ఆసరాతో మహిళల్లో ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం కిశోర్ అన్నారు. వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని న్యూ కాలనీలో ఆసరాపై మహిళా సంఘాల వద్దకు గురువారం వెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొదటి విడతలో భాగంగా మార్చి 14 నుంచి 24 వరకు మహిళా సంఘాలతో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. 25న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా మూడో విడతను ప్రారంభిస్తారన్నారు.



వైఎస్సార్ ఆసరాపై కురుపాంలో అవగాహన కల్పిస్తున్న ఏపీఎం, సిబ్బంది

ఉగాదికి గృహ ప్రవేశాలు

పాలకొండ రూరల్: ఉగాది పర్వదినం రోజున జగనన్న కాలనీల్లో సామూహిక గృహ ప్రవేశాలకు లబ్ధిదారులు సిద్ధం చేయాలని గృహ నిర్మాణ శాఖ ఏఈ మాధవరావు అన్నారు. సచివాలయాల వారీగా అక్కడ సిబ్బంది, లబ్ధిదారులు, వలంటీర్లతో గురువారం సచివాలయాల వారీగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్లాబ్ స్థాయిలో నిర్మాణం పూర్తి చేసిన వారు సకాలంలో మిగిలిన పనులు చేపట్టాలన్నారు. ఇళ్ల నిర్మాణ స్థాయికి అనుగుణంగా బిల్లులు త్వరితగతిన చెల్లించనున్నట్టు తెలిపారు. వార్డుల వారీగా లబ్ధిదారులు, వారు చేపడుతున్న నిర్మాణ పనుల తాజా పరిస్థితిని నమోదు చేశారు.



కోమటిపేట సచివాలయంలో లబ్ధిదారులు, సిబ్బందితో సమీక్షిస్తున్న ఏఈ

పశు ఆరోగ్యంపై అవగాహన అవసరం

గరుగుబిల్లి: పాడి రైతులు పశువుల ఆరోగ్యంపై అవగాహన కలిగి వుండాలని పశువైద్యాధికారి బి.గణపతిరావు అన్నారు. మండలంలోని తోటపల్లి గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమంలో భాగంగా పశువుల సంరక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు వచ్చే వ్యాధులు, నివారణ, ముందస్తు చర్యలు తదితర వాటిపై విద్యార్థులకు డాక్టర్ గణపతిరావు, డాక్టర్ సురేష్‌కుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలు పశువులకు తనిఖీలను నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ.సింహాచలమమ్మ, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి బి.హరిరామకుమార్, సిబ్బంది ఆర్.కూర్మచైతన్య, హెచ్.అరుణకుమారితో పాటు కార్యదర్శి ఎన్.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు మందులను అందజేస్తున్న వైద్యులు గణపతిరావు

ప్రకృతి వ్యవసాయంతో బహు లాభాలు

- మన్యం జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి షణ్ముఖరాజు

కురుపాం: ప్రజారోగ్యం దృష్ట్యా ప్రకృతి వ్యవసాయం వైపు మరింత మంది రైతులు దృష్టి సారించేలా కృషి చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి పి.షణ్ముఖరాజు అన్నారు. మండల కేంద్రంలోని ఆర్‌బీసీ కాంప్లెక్స్ ఆవరణంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలకు చెందిన ఎల్ 1 కార్యకర్తలకు ఒక్క రోజు శిక్షణను గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో పది మంది ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవడంతో పాటు ప్రకృతిని పరిరక్షించుకోవడం జరుగుతుందన్నారు . ప్రస్తుతం సాగు చేస్తున్న వారు ఇతర రైతులకు ప్రకృతి సాగు వలన కలిగే లాభాలు, అధిక దిగుబడులను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ డివిజన్ ఇన్‌చార్జ్ జి.అన్నపూర్ణ, మార్కెటింగ్ ట్రైనీలు నిర్మల, బాలామణి, పురుషోత్తం, భూషన్, నరేష్ ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు పాల్గొన్నారు .



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి షణ్ముఖరావు

లక్ష్యాలను అధిగమించకుంటే చర్యలు

జియ్యమ్మవలస: పంచాయతీల్లో పేరుకుపోయిన ఇంటి పన్ను బకాయిల లక్ష్యాలను అధిగమించకపోతే చర్యలు తప్పవని డీఎల్‌పీఓ జె.రామప్రసాద్ కార్యదర్శులను హెచ్చరించారు. ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండలంలో రూ.14,30,333లు వసూలు చేయాల్సి వుండగా ఇంతవరకు రూ.10లక్షల 82,054లు వసూలైందన్నారు. మిగిలినది కూడా ఈ నెలాఖరులోగా వసూలు చేయాలన్నారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. సమావేశంలో ఎంపీడీఓ ఎస్.రమేష్‌తో పాటు వివిధ పంచాయతీలకు చెందిన కార్యదర్శులు పాల్గొన్నారు.



కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ రామప్రసాద్